క్లుప్తంగా

పర్యావరణానికి మొక్కలు దోహదం



తెనాలిఅర్బన్: పర్యావరణానికి మొక్కలు దోహదపడతాయని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు పేర్కొన్నారు. లోకేష్, బాషా సంయుక్త ఆధ్వర్యంలో ఆలపాటి నగర్‌లో శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు డాక్టర్ జీవనలత, కన్నెగంటి మురళి, ఈదర పూర్ణచంద్, ఎస్.వెంకటేశ్వరరావు, టి.రాంబాబు, రాజశేఖర్‌రెడ్డి, ఆలపాటి వెంకట్రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలి



తెనాలిరూరల్: తెనాలి అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగుతున్నాయి. వారోత్సవాల్లో ఐదో రోజైన శుక్రవారం స్థానిక కొత్తపేటలోని అగ్నిమాపక కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి బుర్రిపాలెం రోడలోని పెమ్మసాని పెట్రోలు బంకుకు అధికారులు, సిబ్బంది చేరుకున్నారు. ఇన్‌చార్జి అగ్నిమాపకాధికారి కోటిరెడ్డి ఆధ్వర్యంలో పెట్రోలు బంకు వద్ద ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది పెట్రోలు బంకు సిబ్బందికి అగ్ని ప్రమాదాల మీద అవగాహన కల్పించి అనుకోకుండా ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వేసవి కాలంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నాటక రంగానికి పూర్వ వైభవం తెచ్చిన బళ్ళారి రాఘవ



తెనాలిఅర్బన్: నాటక రంగానికి పూర్వ వైభవాన్ని బళ్ళారి రాఘవ తీసుకువచ్చారని ఇస్కఫ్ నాయకురాలు శ్రీదేవి పేర్కొన్నారు. అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఇస్కఫ్ సమావేశ హాల్‌లో బళ్ళారి రాఘవ వర్ధంతి సభను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు రంగస్థలానికి కొత్త కళలు ప్రవేశపెట్టిన కీర్తి తోరణాలను ఆయన సంతరించి పెట్టారన్నారు. తెలు గు నాటక రంగంలోనే కాక విదేశాలలో కూడా ఆంగ్ల నాటకాల్లో నటించి దేశానికి పేరు ప్రతిష్టలు తెచ్చారని కొనియాడారు. వెనిగళ్ళ ప్రసాద్ మాట్లాడుతూ గొప్ప రచయితగా, విమర్శకుడుగా రాఘవ పేరుగాంచారన్నారు. బళ్ళారి రాఘవ నాటకాన్ని మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్‌లు చూసి ప్రసంసించారని గుర్తు చేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'ఈ -వ్యర్థాల'పై అవగాహన

మంగళగిరి నగర పరిధిలోని ఆత్మకూరులో శనివారం 'ఈ -వ్యర్థాల'పై ప్రజలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ అలీంబాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందికి అందజేసి స్వచ్ఛ మంగళగిరికి ప్రజలు సహకరించాలని కోరారు. శనివారం ఉదయం ఆత్మకూరు అండర్ పాస్ సర్వీసు రోడ్డులో ప్రారంభమయ్యే స్వచ్ఛ మంగళగిరి కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని అంజిరెడ్డి కాలనీలో మైనర్‌పై అత్యాచారం చేసిన నిందితు డిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాధిత కుటుంబా న్ని పరామర్శించామని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడికి కఠిన శిక్ష పడేలా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాడ్ చేశారు. నిందితుడిపై పోక్సో కింద కేసు నమోదు చేయాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

నేడు 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర'

దుగ్గిరాల: ప్రతి నెల మూడో శనివావారం జరిగే 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ఈ నెల 19వ తేదీన దుగ్గిరాలలో ఉంటుందని శుక్రవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలలో కార్యక్రమం జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

నియోజకవర్గంలో ఘనంగా శుభ శుక్రవారం

- అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు
- పలుచోట్ల క్రీస్తు శిలువ నాటిక ప్రదర్శనలు

తెనాలిఅర్బన్: ఏసుక్రీస్తు మరణంలోని అంతర్యాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని టౌన్‌చర్చి పాస్టర్ రెవరెండ్ దేవరపల్లి యేసురత్నం పేర్కొన్నారు. శుభశుక్రవారాన్ని పురస్కరించుకుని టౌన్‌చర్చిలో శుక్రవారం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు మనుష్యుల పాపాలను విముక్తి చేసేందుకు శిలువలో మరణించారని తెలిపారు. ఆయన మూడోవ రోజున పునరుత్థానుడుగా తిరిగి లేచాడని చెప్పారు. ఏసుక్రీస్తు బోధనలు అందరూ ఆచరించాలని సూచించారు. అనంతరం శిలువలో ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలు వివరించారు. కార్యక్రమంలో రెవరెండ్ దగ్గుమల్లి సల్మాన్‌రాజు, రెవరెండ్ వి.వి.ప్రకాష్‌బాబు, ఆడహక్ కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

- ఐతానగర్‌లోని రక్షణ సైనం చర్చిలో గుడ్‌ఫ్రైడే ఆరాధన జరిగింది. ఈ సందర్భంగా సంఘ కాపరి మేజర్ నాగరాజు మాట్లాడుతూ దైవకుమారుడు అయిన ఏసుక్రీస్తు మానవజన్మలో జన్మించారని తెలిపారు. ఆయన శాంతి, సమాధానం, సోదర భావం కలిగి ఉండాలనే బోధనలు చేశారని చెప్పారు. ప్రపంచంలోని అన్ని దేశాలు ఆయన బాటలో పయనిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పి.రత్నసుందరీ, సంఘ పెద్దలు పిల్లి కనకరత్నం, కారుమంచి నరసింహా, గాలి ర వికుమార్, ఐట్టు జక్రయ్య, రుద్రపాటి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.
- ఐతానగర్ ఈరే చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు జరిగాయి. ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలను బిషప్ సుధీర్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పాల్గొన్నారు.
- మారీసుపేటలోని ఫిలదెల్ఫియా చర్చిలో, పట్టణంలోని లూథరన్, బాప్టిస్ట్, హోసన్నా మినిస్ట్రీస్ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఆయా సంఘాల పాస్టర్‌లు వాక్యపరిచర్య చేశారు.
- ఐతానగర్‌లోని లూథరన్ చర్చిపాస్టర్ సర్వోన్నత రావు ఆధ్వర్యంలో, చెంచుపేట ఆర్‌సీఎం చర్చి ఫాదర్ స్లీవా ఆధ్వర్యంలో క్రీస్తు శిలువధార నాటికలను ప్రదర్శించారు. కొందరూ యువకులు శిలువ ఘట్టాలను కళ్లకు కట్టినట్లు చూపారు. నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బిషప్ సుధీర్ కుమార్, టౌన్‌పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అబ్రహం, కల్నల్ థామస్, తదితరులు పాల్గొన్నారు.
- మండల గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిలో ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు చేశారు. రూరల్ మండలం కొలకలూరులోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ మెలిక్యూవ్‌రాజు ప్రత్యేక దివ్య బలిపూజను నిర్వహించారు. చర్చి ఆవరణలో శిలువ మార్గం నిర్వహించారు. ఫాదర్, భక్తులు శిలువను మోశారు. భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జూబ్లీ స్కూల్ సిస్టర్స్, సంఘ పెద్దలు, మరియదళం సభ్యులు, మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

రూరల్ పరిధిలో...

తెనాలిరూరల్: క్రైస్తవులు పవిత్రంగా భావించే గుడ్‌ఫ్రైడే (మహా శుక్రవారం)ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మానవాళి పాపాల కోసం ఏసుక్రీస్తు చేసిన ప్రాణ త్యాగాన్ని స్మరించుకుంటూ ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. శిలువలో ఏసు క్రీస్తు పలికిన ఏడు మాటలను ధ్యానించారు. మండలంలోని చావావారిపాలెం గ్రామంలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ శౌరిరాజు ఆధ్వర్యంలో శిలువ ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఏసుక్రీస్తు శిలువ యాత్ర ప్రదర్శించారు. లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ పత్రే వరబాబు, ఫాదర్ విన్సెంట్, ఫాదర్ సునీల్, హోలీ సిస్టర్స్, సంఘ పెద్దలు, సంఘస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మారీసుపేటలోని రాక్ గాస్పెల్ చర్చిలో సంఘ కాపరి, బిషప్ పినపాటి జాన్‌పాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. సంఘ సభ్యులు మీనా, సింధు, షకీలా, సుజని, సరిత, రత్నకుమారి, సుధారాణి ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలను వివరించారు. సంఘ పెద్దలు పినపాటి డేవిడ్‌రాజు, ఈవూరి శ్రీనివాసరావు, దానియేలు, ఏసురత్నం, కసుకుర్తి భాస్కరరావు, జయరాజు, ఏసుదాసు, ఫ్రాన్సిస్ ఆరాధనను పర్యవేక్షించారు. బిషప్ జాన్‌పాల్ పార్ధనాశీర్వాదాలను అందించారు.

కొల్లిపర: మండల పరిధిలోని మున్నంగి గ్రామంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా శిలువ దారి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్నంగి గ్రామంలోని లూథరన్ చర్చి సంఘస్తులు స్త్రీల సంఘం సండే స్కూల్ పిల్లలు సంఘ పెద్దలు గ్రామ పెద్దలు యూత్ సభ్యులు పాల్గొనడం జరిగినది.



తెనాలి ఆర్‌సీఎం చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



చావావారిపాలెంలో శిలువ యాత్రలో ఫాదర్ శౌరిరాజు, రెవ వరబాబు



మున్నంగిలో శిలువ దారి కార్యక్రమం నిర్వహించిన క్రైస్తవులు



తెనాలిలో ప్రసంగిస్తున్న టౌన్‌చర్చి పాస్టర్ రెవరెండ్ యేసురత్నం



తెనాలి ఐతానగర్‌లో లూథరన్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన శిలువ ఘట్టం ప్రదర్శన



తెనాలి ఆర్‌సీఎం చర్చిలో శిలువ నాటికలోని ఒక దృశ్యం



కొలకలూరు ఆర్‌సీఎం చర్చిలో శిలువధారి నాటిక

రేషన్ షాపుల్లో తనిఖీలు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని రేషన్ షాపులపై శుక్రవారం పౌరసరఫరాల శాఖాధికారులు మెరుపుదాడి చేశారు. ఇన్‌ఛార్జి డీటీ జాన్, సిబ్బంది రేషన్ షాపులను తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్‌లోని వ్యత్యాసాలను గుర్తించారు. రేషన్ లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో మొత్తం ఏడు రేషన్ షాపులు ఉండగా అన్నింటా తనిఖీ చేస్తున్నామని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో రేషన్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేపడతామని స్పష్టం చేశారు. తహసీల్దార్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. రేషన్ లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ పంపిణీ చేయకుండా ఉంటే సహించేది లేదని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లను ఉద్దేశించి హెచ్చరించారు.

షూటింగ్‌లకు అనువైనది పేరేచర్ల అటవీ ప్రాంతం

సినీ దర్శకుడు దిలీప్‌రాజా



తెనాలిఅర్బన్: పేరేచర్ల సమీపంలో ఉన్న 300 ఎకరాల అటవీ ప్రాంతం సినిమా షూటింగ్‌లకు అనుకూలమని సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లోకేషన్‌లను ఉచితంగా అందిస్తుందని, ఈ అవకాశాన్ని తెలుగు సినిమా నిర్మాత దర్శకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొండ ప్రాంతంలో ట్రెక్కింగ్ సౌకర్యం ఉండటం ప్రయోజనకరమన్నారు. అనేక సన్నివేశాలు దానిలో చిత్రీకరించవచ్చని చెప్పారు. తక్కువ బడ్జెట్‌తో సినిమా నిర్మాణం కూడా ఇక్కడ పూర్తయే అవకాశం ఉందన్నారు. త్వరలో తాను నిర్మించనున్న సినిమాను ఇక్కడే జరుపుతానని ప్రకటించారు. కార్యక్రమంలో దర్శకుడు శ్రీనివాస్ యాదవ్, ఫారెస్ట్ ఆఫీసర్ పోతురాజు, మణివరన్, కిషోర్ పాల్గొన్నారు.

పురపాలక భవనాలకు శిథిలావస్థ!!



కమిషనర్‌లో చాంబర్‌లో పగిలిన సీలింగ్





మొదటి అంతస్తుల్లో బయటపడిన ఇనుప చువ్వలు

- పెచ్చులూడుతున్న శ్లాబ్‌లు
- భయం భయంగా జీవిస్తున్న ఉద్యోగులు
- రూ.15 కోట్లతో నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు
- ఉన్నతాధికారుల అనుమతుల కోసం ఎదురు చూపులు

తెనాలిఅర్బన్: పట్టణ పురపాలక సంఘ భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు ఎవరిపై శ్లాబ్ పెచ్చులు ఊడి పడతాయో అనే ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది. కొన్నిసార్లు శ్లాబ్ పెచ్చులూడి అధికారుల సమీపంలో ఊడి పడుతుంటంతో భయం భయంగా బ్రతుకు జీవుడా అంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. మున్సిపల్ కార్యాలయ అధిపతిగా భావించే కమిషనర్ చాంబర్‌లోనే ఇటీవల పెచ్చు ఊడి పడిందంటే దీని తీవ్రత ఏ మేరకు ఉందో మనకు అర్థమవుతుంది.

1966లో నిర్మాణం!

తెనాలి మున్సిపల్ కార్యాలయాన్ని 1966లో నిర్మించారు. దీనిని అప్పటి ముఖ్యమంత్రి కె.బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఆ సమయంలో ప్రధాన రహదారి వైపు షాపులు నిర్మించారు. మిగిలిన భాగంతో పాటు మొదటి, రెండవ అంతస్తులో పురపాలక సంఘ పరిధిలోని వివిధ విభాగాలను ఏర్పాటు చేశారు. భవనం ఇరుకుగా ఉండటంతో దానిలోని వెనుక వైపు 2006లో మొదటి అంతస్తులో కౌన్సిల్ హాల్‌ను, గ్రౌండ్ ఫ్లోర్‌లో మెప్మా, హెల్త్ సెక్షన్ భవనాన్ని నిర్మించారు. అలాగే మెప్మా షెడ్‌ను కూడా నిర్మించారు.

నూతన భవనానికి ప్రతిపాదనలు

తెనాలి పురపాలక సంఘం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో దానిని నిర్మించాలని అధికారులు భావించి ప్రతిపాదనలు గతంలో సిద్ధం చేశారు. భవనాన్ని పూర్తిగా పడగొట్టి దానిలో సెల్లార్‌తో పాటు నాలుగు అంతస్తులు నిర్మించాలనే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి తెనాలిలో పర్యటించిన సందర్భంలో నూతన భవనానికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారుల అనుమతులకు పంపారు. ఈ లోపు ఎన్నికలు రావటంతో ఆ ప్రక్రియ పూర్తిగా నిలచిపోయింది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు మళ్లీ మున్సిపల్ అధికారులు డిజైన్‌లలో కొన్ని మార్పులు చేసి రూ.15 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దానిని ఉన్నతాధికారులు ఆమోదించి నిధులు విడుదల చేయాల్సి ఉంది. అలాగే మున్సిపల్ కార్యాలయాన్ని తాత్కాలికంగా మున్సిపల్ మార్కెట్ భవనంలోకి మార్పు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.


దీని కోసం రూ.40 లక్షలు వెచ్చించారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నూతన మున్సిపల్ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దిగ్విజయంగా 58 సంవత్సరాలు!

తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌ల చాంబర్‌లతో పాటు రెవెన్యూ, అకౌంట్, ఆడిట్ సెక్షన్‌లు, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, మెప్మా, హెల్త్ విభాగాలు ఉంటాయి. వీటిలో శాశ్విత ఉద్యోగులు 229 మంది, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 480 మంది పని చేస్తుంటారు. వీరు కాకుండా ప్రతిరోజు సుమారు 250 మంది వరకు వివిధ పనులపై పట్టణ వాసులు కార్యాలయంకు వస్తుంటారు. మున్సిపల్ కార్యాలయంను నిర్మించి 58 సంవత్సరాలు దాటుతుండటంతో దాని శ్లాబ్‌లు పెచ్చులూడటం రెండేళ్ల నుంచి ప్రారంభమైంది.

కింద భాగంలో పెచ్చులూడి ఇనుప చువ్వలు కన్పిస్తున్నాయి. అలాగే మొదటి అంతస్తులోని కమిషనర్ చాంబర్‌లోని శ్లాబ్ ఇటీవల పెచ్చులూడి కింద పడింది. అలాగే కమిషనర్ చాంబర్‌కు ముందు ఉన్న భాగం కూడా పూర్తిగా శ్లాబ్ ఊడిపోయి ఇనుపచువ్వలు కన్పిస్తున్నాయి. అలాగే రెండవ అంతస్తులోని టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల సమీపంలో కూడా ఇదే విధంగా శ్లాబ్ తయారైంది. అయితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అనే ఆందోళన ఉద్యోగుల్లో నెలకొంది.

త్వరలో నూతన భవన నిర్మాణం



తెనాలి పురపాలక సంఘ భవనం శిథిలావస్థకు చేరిన మాట వాస్తవం. దీని స్థానంలో నూతన భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారుల అనుమతుల కోసం పంపాం. త్వరలో అనుమతులు వచ్చే అవకాశం ఉంది. అవి రాగానే దీనిని పడగొట్టి నూతన భవనానికి శంకుస్థాపన చేస్తాం. అలాగే మున్సిపల్ మార్కెట్‌లోని రెండవ ఫ్లోర్‌లో తాత్కాలిక కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వారంలో పనులు ప్రారంభించి జులై నాటికి పూర్తి చేస్తాం. అనంతరం కార్యాలయాన్ని దానిలోకి మార్పు చేస్తాం.

–ఆకుల శ్రీనివాసరావు, ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజనీర్, తెనాలి పురపాలక సంఘం

పచ్చి రొట్టెతో భూసారం మరింత పెరుగుదల

ప్రకృతి వ్యవసాయం సి.ఆర్.పి అద్దంకి వెంకటరమణ

కొల్లిపర: 30 రకాల పచ్చి రొట్టె విత్తనాలను భూమిలో వేయటం వలన భూమికి భూసారం పెరగటంతో పాటు పంటలకు నాణ్యమైన బలం లభిస్తుందని వల్లభాపురం ప్రకృతి వ్యవసాయం సి.ఆర్.పి అద్దంకి వెంకటరమణ రైతులకు సూచించారు శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం కార్యక్రమం ద్వారా రైతులకు 30 రకాల పచ్చి రొట్టె విత్తనాలను ప్యాకేజీ రూపంలో తయారుచేసి రైతులకు ఉచితంగా అందజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చ రొట్టె విత్తనాలు పంట భూములో సాగు చేయటం వలన భూసారం పెరిగి పంటలకు ఆశించే క్రిమి కీటకాలను తగ్గించడానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు తద్వారా పంటలు నాణ్యమైన దిగుబడులతో పాటు ఆరోగ్యాన్ని పెంపొందించే ఆహార పదార్థాలు ప్రతి ఒక్కరికీ అందించవచ్చని తెలిపారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా గ్రామంలో రైతులకు పి.ఎం.డి.ఎస్ విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం చేయాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు అందజేస్తున్న వెంకటరమణ

ప్రతి విద్యార్థికి ఉద్యోగమే ఏఎస్ఎన్ లక్ష్యం



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో శివకుమార్, రామ్‌చంద్

ఎచీవర్స్‌డేలో ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: క్రమశిక్షణ, నాణ్యమైన బోధన, క్యాంపస్ ఉద్యోగాలతో విద్యారంగంలో దూసుకుపోతున్న ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ప్రతి విద్యార్థికి ఉద్యోగం అందించటమనే లక్ష్యానికి అతి చేరువ కాగలిగిందని ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. 2024–25 విద్యాసంవత్సరంలో ఫైనలియర్ డిగ్రీ చదివిన విద్యార్థులు 92.3 శాతం మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన సందర్భంగా శుక్రవారం డిగ్రీ కాలేజి ఆవరణలో ఎచీవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ ఏటా కాలేజీలో క్యాంపస్ డ్రైవ్‌లు కొనసాగుతూ వస్తూ, తమ విద్యార్థులు అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలకు ఎంపికవుతున్నారని గుర్తుచేశారు. కరోనా విపత్కర పరిస్థితుల తర్వాత కంపెనీల క్యాంపస్ రిక్రూట్‌మెంట్ విధానంలో మార్పులు వచ్చాయని చెప్పారు. ఇంటర్వ్యూలు సహా ఆన్‌లైన్‌లో జరుగుతున్నందున ఆ దిశగా తమ విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జీవనకళల్లో శిక్షణ సహా వివిధ కంపెనీలతో ఎంఓయూలు కుదుర్చుకుని, సర్టిఫికెట్ల కోర్సులకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఫలితంగానే తమ విద్యార్థులు ఏటికేడాది గొప్ప అవకాశాలను అందుకుంటున్నారని తెలిపారు. ఆ క్రమంలోనే ఈసారి 92.3 శాతం మంది 18పైగా కంపెనీల్లో ఉద్యోగాలను పొందినట్టు చెప్పారు. ఈ సంవత్సరం ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు ఐటీ రంగంలో ఉద్యోగాలను దక్కించుకోవటం శుభ పరిణామమన్నారు. టీసీఎస్, విప్రో, సీటీఎస్, ఇన్ఫోసిస్, డెల్లాయిట్, టెక్ మహేంద్ర, ఐఎల్ ఎమ్, సదర్ ల్యాండ్, 24 సెవెన్ ఏ ఐ వంటి ప్రతిష్టాత్మక కంపెనీల్లో ఉద్యోగాలు లభించటం సాధారణం కాదన్నారు. ప్రతిఒక్కరు తల్లితండ్రుల పట్ల, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రాంచంద్ మాట్లాడుతూ ప్రముఖ కంపెనీలతో ఎంఓయూలతో తమ విద్యార్థులు అత్యున్నత నైపుణ్యాలు పెంపొందించుకునేలా కృషిచేస్తున్నామని చెప్పారు. ఉద్యోగాలను పొందిన విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు.

మున్సిపల్ అధికారులకు ధన్యవాదాలు

తెనాలిఅర్బన్: పట్టణంలోని క్రైస్తవ సమాధుల ప్రాంగాణాన్ని శుభ్రం చేసిన మున్సిపల్‌కమిషనర్, ఆరోగ్యాధికారి, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు దళిత విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వమత సామరస్య సుహృద్భవ గౌరవానికి ఇది శుభపరిణామమని చెప్పారు. క్రైస్తవులందరూ భక్తిశ్రద్ధలతో ఈస్టర్‌ను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

రజక వలంటరీ సర్వీస్ సొసైటీ సేవలు అభినందనీయం

తెనాలిఅర్బన్: రజక వాలంటరీ సర్వీస్ సొసైటీ సేవలు అభినందనీయమని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వల్లూరి మహాలక్ష్మిపతిరావు పేర్కొన్నారు. రజక వాలంటరీ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మారీసుపేట రెండు గేట్ల మధ్యలో ఏర్పాటుచేసిన చలివేంద్రంను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 సంవత్సరాల నుంచి వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం జరుగుతుందన్నారు. అధ్యక్షుడు పోతార్లంక ప్రసాద్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్‌లు, చలివేంద్రాలు వంటి వాటి ద్వారా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ చలివేంద్రాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో24వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య, కార్యదర్శి పెటేటి శ్రీనివాస్, నాయకులు పెదలంక వెంకటేశ్వర్లు, పోతర్లంక శ్రీనివాస్, శివరామకృష్ణ, వెంకటనాంచారయ్య, మురళీకృష్ణ, మోపిదేవి శ్రీనివాస్, కొల్లూరు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

భావన్నారాయణస్వామి రథం పనులను పరిశీలించిన కోన



బాపట్ల: బాపట్ల భావన్నారాయణస్వామి దేవాలయానికి చెందిన నూతన రథం పనులను మాజీ శాసన సభ ఉప సభాపతి కోన రఘుపతి శుక్రవారం పరిశీలించారు. రథం పనులపై శిల్పి గణపతి ఆచారి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసమూర్తితో ఆయన చర్చించారు. ఈ సందర్భంలో శిల్పి గణపతా చారి పదే పదే ఇదంతా తమరి కృషి వల్లే జరిగిందని చెప్పారు. అనంతరం భావదేవుని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోనతోపాటు బాపట్ల పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, మండల అధ్యక్షుడు మరుప్రోలు ఏడుకొండలరెడ్డి తదితరులు ఉన్నారు.